గుండెపోటుతో మిర్చి రైతు మృతి

దిగుబడులు రాక మనస్తాపం

అప్పుల బాధ తట్టుకోలేక గుండెపోటు

మహబూబాబాద్ జిల్లా సీతంపేటలో విషాదం

గార్ల, ఫిబ్రవరి 10: దిగుబడులు ఆశించిన మేర లేకపోవడం, అప్పులు కుప్పగా మారడంతో దిగులుతో ఉన్న మిర్చి రైతు గుండెపోటుతో మరణించాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట గ్రామ పంచాయతీ మంగళ తండాలో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళతండాకు చెందిన బానోత్ ధర్మా (42) పదేండ్లుగా మిర్చి సాగు చేస్తున్నాడు. గతంలో ధర్మా రూ. 20 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ ఏడాది మొత్తం తొమ్మిది ఎకరాల్లో నాలుగు ఎకరాలు మిర్చి పంట సాగు చేసి పెట్టుబడి కోసం రూ. తొమ్మిది లక్షలు అప్పు తీసుకొచ్చాడు. సోమవారం ఉదయం 93 బస్తాలు మిర్చి ఖమ్మం మార్కెట్ తీసుకొని వెళ్లి అమ్ముకొని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో ద్విచక్ర వాహనంపై నుంచి పడటంతో స్వల్పంగా గాయ పడ్డాడు. ఇంటికి వచ్చిన ధర్మా భార్య క్రాంతితో మాట్లాడుతూ అప్పులు ఎలా తీర్చాలో అని బాధపడుతూ ఒక్కసారిగా గుండెనొప్పితో కిందపడిపోయాడు. సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ధర్మా మృతితో మంగళి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చిబస్తాలు

పోటెత్తిన ఎర్రబంగారం

ఖమ్మం మార్కెట్‌కు లక్ష బస్తాలు

జెండాపాటలో క్వింటాల్ రూ.14 వేలు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 10 : ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం రైతులు సుమారు లక్ష మిర్చి బస్తాలను తీసుకొచ్చారు. రెండ్రోజుల సెలవుల అనంతరం క్రయవిక్రయాలు ప్రారంభం కావడంతో మిర్చిబస్తాలతో మార్కెట్‌యార్డు పోటెత్తింది. ఖమ్మం జిల్లా నుంచేకాక పొరుగు జిల్లాల నుంచి సైతం రైతులు ఊహించని విధంగా పంటను తెచ్చారు. గత వారం ఒకేరోజు సుమారు 75 వేల బస్తాలు రాగా సోమవారం ఏకంగా లక్ష బస్తాలు వచ్చాయి. జెండాపాటలో ఖరీదుదారులు క్వింటాల్ మిర్చి ధరను రూ.14 వేలుగా నిర్ణయించారు. అంతకుముందు రూ.13,600గా నిర్ణయించడంతో రైతులు, కొంతమంది అడ్డీదారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో చివరకు రూ.14 వేలుగా ప్రకటించారు. వందలాది మంది రైతులు పంటను తీసుకొచ్చినప్పటికీ కేవలం ఒక్కరిద్దరికి మాత్రమే జెండాపాట ధర పలకడం గమనార్హం. మిగిలిన రైతుల పంటకు అత్యధిక ధర క్వింటాల్ రూ.12,500 నుంచి రూ.13,500 పలికింది. క్రయవిక్రయాలకు యార్డు సరిపోకపోవడంతో వాహనాలు బయటనే నిలిచిపోయాయి. తాలురకం ధర మరింత క్షీణించింది. అడిగేవారు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారీతిన తాలు రకానికి ధర నిర్ణయించి కొనుగోలు చేశారు.

ఇంకా వడ్ల బోనస్ రాలే

రెండున్నర ఎకరాల సొంత భూమితో పాటు పదెకరాలు కౌలుకు సాగుచేసిన. 240 క్వింటాళ్ల వడ్లు పండినయి. బోనస్ వస్తుందనే ఆశతో కంటికి రెప్పలా ఇరవై రోజులు పంటను కాపాడి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో వడ్లు ఆరబోసి అమ్మిన. లక్ష రూపాయల వరకు బోనస్ రావాలే. నెల దాటింది. ఎప్పుడు వేస్తరో తెలియదు. బోనస్ వస్తే పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు కట్టుకుందామనుకున్న.

- గండు బాలకృష్ణ, రైతు, బయ్యారం, మహబూబాబాద్

రెండు నెలలైనా పైసలు వేయలే

32 క్వింటాళ్ల ధాన్యాన్ని ముంగి ముడుగు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా పెట్టిన. నెల పదిహేను రోజుల తర్వాత మద్దతు ధర పైసలు వచ్చినయి. కానీ, రెండు నెలలైనా బోనస్ పైసలు వేయలేదు. అధికారులకు ఫోన్ చేస్తే వస్తుందని అంటున్నారు తప్ప వేయడం లేదు. 48 గంటల్లో బోనస్ వస్తదని కాంటా పెడితే ఇప్పటికీ పైసలు రాలేదు. బోనస్‌పై ఆశతో యాసంగి సాగు కోసం మిత్తికి పైసలు తెచ్చిన. వడ్డీ పెరుగుతున్నది.

- మారపంగు వెంకన్న, రైతు, మహబూబాబాద్

ఎప్పుడిస్తరో చెప్పట్లేదు

నిరుడు డిసెంబర్ 23న బొల్లికుంటలోని ఐకేపీ సెంటర్‌లో 32 క్వింటాళ్ల వడ్లు అమ్మిన. నెల తర్వాత క్వింటాలుకు రూ.2,327 చొప్పున అకౌంట్‌లో పడ్డయి. బోనస్ మాత్రం పడలే. మా గ్రామంలో 20 మంది బోనస్ రాని రైతులు ఉన్నారు. రైతును రాజును చేస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం మా శ్రేయస్సును మరిచింది.

-దేవర రాజు, బొల్లికుంట, వరంగల్

సూర్యాపేటలో ఎస్సారెస్పీ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

గోదావరి జలాల కోసం రైతుల ఆందోళన

ఎస్సారెస్పీ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 10 : సాగు కోసం నీళ్లు ఇచ్చి పంటలను కాపాడాలని కోరుతూ రైతులు ఆందోళనకు దిగారు. సూర్యాపేట జిల్లా మోతె, చివ్వెంల, నడిగూడెం, మునగాల మండలాల్లో ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని కోరుతూ గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేటలోని ఎస్సారెస్పీ ఎస్ఈ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య మాట్లాడుతూ యాసంగి పంటలకు విడతల వారీగా నీళ్లు విడుదల చేస్తామని స్వయంగా నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించినా నేటి వరకు నీళ్లు రావడం లేదని మండిపడ్డారు. మోతె, చివ్వెంల, నడిగూడెం, మునగాల మండలాల్లోని రైతులు తమకున్న బోర్లు, బావులు, చెరువులను ఉపయోగించుకొని వరినాట్లు వేసుకున్నారని, ప్రస్తుతం భూగర్భ జలాలు ఇంకిపోవడంతో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నామవరం చెరువును రిజర్వాయర్ చేసి పాలేరు నుంచి నీళ్లను లిఫ్ట్ చేసి ఈ ప్రాంత చెరువులను నింపాలని కోరారు. అయితే ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

సాగునీటి కోసం కలెక్టరేట్‌కు

9వ ప్యాకేజీ కెనాల్ బాధిత రైతులు • చెరువులు నింపాలని కలెక్టర్‌కు విన్నపం

ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల తెలంగాణచౌక్, ఫిబ్రవరి 10 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని కాళేశ్వరం 9వ ప్యాకేజీ కెనాల్ పరీవాహక ప్రాంత రైతులు సాగునీటి కోసం కలెక్టరేట్ బాట పట్టారు. కాలువ నీళ్లు రాక చెరువులు ఎండిపోయి, భూగర్భ జలాలు ఇంకిపోయి విలవిలలాడుతున్న దీన స్థితిలో ఉన్నామని, వెంటనే నీళ్లు ఇచ్చి పంటలను కాపాడాలని కోరుతూ మండలంలోని కిష్టునాయక్‌తండా, రాజన్నపేట, దేవునిగుట్ట తండా, బాకుర్‌పల్లి గ్రామాలకు చెందిన సుమారు 40 మంది రైతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని మైసమ్మ చెరువును 9వ ప్యాకేజీ కాలువ ద్వారా నీటిని నింపితే అక్కడున్న పంట పొలాలకు నీరందుతుందని కలెక్టర్‌ను కోరారు.

సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో చుక్క నీరులేక ఎండిపోయిన మల్కపేట కాల్వ

వరంగల్ జిల్లా నల్లబెల్లిలో ఎడ్లబండిపై వచ్చి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, రైతులు

కాంగ్రెస్ సర్కారుపై భగ్గుమన్న రైతులు

నర్సంపేట నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

నర్సంపేట నమస్తే నెట్‌వర్క్/నల్లబెల్లి, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గంలో సోమవారం నిరసనలు వెల్లువెత్తాయి. రేవంత్ సర్కారు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు రోడ్డెక్కారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకంలో ఎకరానికి రూ.15 వేలు అందించాలని, సన్న వడ్లకు బోనస్ రూ.500 రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. నల్లబెల్లి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తన నివాసం నుంచి ఎడ్లబండిపై వచ్చి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ సర్కారు హామీలన్నీ బోగస్‌సేనని తేలిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతది భరోసా లేని బతుకైందని ఆవేదన చెందారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్లపైకి వచ్చి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతుభరోసాకు సంబంధించి ప్రతి రైతు ఖాతాలో డబ్బులు పడతాయని.. సెల్ ఫోన్లు టింగుటింగుమంటాయని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉందని కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు.

ఆశపడి నష్టపోయాం

అప్పులు చేసి నాలుగున్నర ఎకరాల్లో పంట పండించిన. బోనస్ వస్తదనే ఆశతో కొనుగోలు కేంద్రంలో 158 క్వింటాళ్లు అమ్మిన. రూ.79,200 రావాలి. అధికారులను ఎప్పుడు అడిగినా వస్తదనే అంటున్నరు. ఇప్పటికే మూడు నెలలైంది. కాంగ్రెస్ పాలనలో ప్రచారమే తప్ప, రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.

- హెచ్ సంతోష్‌కుమార్, నిజామాబాద్ జిల్లా

మూడు నెలలైనారాలే

నేను మూడు ఎకరాల్లో వరి పండించిన. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పడంతో ఆశతో 107 క్వింటాళ్ల వడ్లమ్మిన. రూ. 52,600 బోనస్ రావాలి. మూడు నెలలైనా ఇస్తలేరు. బోనస్ వస్తదని అప్పులు చేసిన. ప్రభుత్వం రైతులకు అన్యాయం చేయడం తగదు.

- బోయి రాములు, రైతు, లింగాపూర్, కోటగిరి మండలం, నిజామాబాద్ జిల్లా

బోనస్ రాలేదు

కోటపల్లిలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో 120 క్వింటాళ్ల వడ్లు అమ్మిన. 45 రోజులైంది. ఇప్పటివరకు రూపాయి బోనస్ రాలేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మా చేతుల్లో ఏమీ లేదని చెబుతున్నారు. ఇప్పుడు మేం ఎవరికి చెప్పుకోవాలి.

- రాళ్లబండి శ్యామ్‌సుందర్, కోటపల్లి, మంచిర్యాల జిల్లా

నాగర్‌కర్నూల్ అడిషనల్ కలెక్టర్ అమరేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెంట్లవెల్లి రైతులు, అఖిలపక్ష నాయకులు

మా రుణం ఎప్పుడు మాఫీ అయితది సార్?

అడిషనల్ కలెక్టర్‌కు పెంట్లవెల్లి రైతుల వినతి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 10 : పెంట్లవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు తీసుకొని మాఫీ కాని పది మంది రైతులు సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌కు వచ్చారు. అఖిలపక్ష నాయకులతో కలిసి తమకు రుణమాఫీ కాలేదని అడిషనల్ కలెక్టర్ అమరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ంట్లవెల్లి పీఏసీఎస్‌లో 1400 మంది రైతులకు సభ్యత్వం ఉన్నదని, అందులో రూ.2 లక్షల రుణ మాఫీకి 499 మంది అర్హులుగా ఉన్నా.. ఏ ఒక్కరికీ మాఫీ కాలేదన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్లు, ఆర్డీవోకు ఎన్నిసార్లు విన్నవించినా లాభం లేదని వాపోయారు.

ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఏఈ రమేశ్, సహాయకుడు సారయ్య

ఇంటి అనుమతికి 10వేలు లంచం

వరంగల్ జిల్లాలో ఏసీబీకి చిక్కిన పీఆర్ ఏఈ

సుబేదారి, ఫిబ్రవరి 10: ఇంటి అనుమతి కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటూ వరంగల్ జిల్లాలో పంచాయతీరాజ్ ఏఈ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. సంగెం మండలం కుంటపల్లికి చెందిన ఎనబోతుల మొగిలయ్య నుంచి సోమవారం హనుమకొండ సుబేదారిలోని ప్రైవేట్ ఆఫీస్‌లో ఏఈ రమేశ్ ప్రైవేట్ సహాయకుడు గుగులోత్ సారయ్య రూ. పదివేలు లంచం తీసుకొని ఏఈ రమేశ్‌కు అప్పగించాడు. ఏసీబీ అధికారులు వెంటనే ఏఈ రమేశ్, అతడి సహాయకుడు సారయ్యను పట్టుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.

కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా?

- డీఎస్సీ 2008 నియామకాలు ఎందుకు జరగలేదు?
- పాఠశాల విద్యాశాఖపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ఉద్యోగంలో చేరడం కోసం డీఎస్సీ 2008 అభ్యర్థులు ఏండ్ల తరబడి నిరీక్షిస్తున్నారు, కోర్టు కూడా నియామకాలు చేపట్టాలని ఆదేశించింది, అయినప్పటికీ అధికారుల్లో కదలిక లేకపోవడం శోచనీయమని హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా కూడా అర్హులకు ఉద్యోగ కల్పన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులను గౌరవించరా అని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డిని నిలదీసింది. మనుషులు అన్నాక చిన్నచిన్న తప్పులు చేయడం పరిపాటని, అలాంటి వాటిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పింది. కోర్టుధిక్కరణ కింద మీపై ఎందుకు చర్యలు చేపట్టరాదో చెప్పాలని నిలదీసింది. ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీ చేస్తే మీ భవిష్యత్తుకు ఇబ్బందేకదా అని వ్యాఖ్యానించింది. 2008 డీఎస్సీకి సంబంధించి 1382 పోస్టుల భర్తీ వ్యవహారంపై జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ ఈ తిరుమలాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. తొలుత ప్రభుత్వ న్యాయవాది మాట్లాడుతూ.. డీఎస్సీ 2008కి సంబంధించి 1382 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకున్నామని, నియామకం చేపడతామని చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. కోర్టు ఉత్తర్వులను అమలు చేయనిపక్షంలో ఉన్నతాధికారిని విచారణకు హాజరుకావాలని ఆదేశించాం కదా? ఎందుకు హాజరుకాలేదు? అని ప్రశ్నించింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయాల్సివస్తుందని హెచ్చరించింది. అనంతరం ప్రభుత్వ న్యాయవాది విజ్ఞప్తి మేరకు విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. మధ్యాహ్నం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి విచారణకు హాజరయ్యారు. నియామక ప్రక్రియ మొదలుపెట్టామని, మూడు రోజుల్లో పూర్తిచేస్తామని చెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేశారు.

మొక్కలు పెంచినోళ్లే నరికేశారు!

- కోనరావుపేట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో చెట్లు నరికివేత
- ఆ తర్వాత దుంగలు మాయం
- మాడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించామంటున్న అధికారులు

కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నరికివేసిన చెట్లు

కోనరావుపేట, ఫిబ్రవరి 10 : 'మొక్కలు నాటాలి.. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది.. ఇంటికి ఐదు మొక్కలు పెంచాలి' అంటూ ప్రతి ప్రభుత్వ సమావేశాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులే మొక్కల పాలిట శాపంగా మారారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లను మేకలు మేస్తే కాపరికి, ఇంటి ఎదుట పెరిగిన చెట్టు కొమ్మలను నరికి వేస్తే యజమానికి జరిమానా విధించి అధికారులే.. ఏపుగా పెరిగిన పదుల సంఖ్యలో చెట్లను నరికేసి, ఆ చెట్ల దుంగలను మాయం చేసిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో వెలుగుచూసింది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో గత ప్రభుత్వ హయాంలో హరితహారం పథకం ద్వారా మొక్కలు నాటారు. అవి ఇప్పుడు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. ఆయా పనుల కోసం మండల కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఆ చెట్లు సేద తీర్చుకునేందుకు నీడ నిచ్చేవి. ప్రస్తుత ప్రభుత్వం మండలానికో మాడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మించేందుకు అధికారులు ఈ చెట్లు ఉన్న స్థలాన్నే కేటాయించారు. చెట్లు నరికివేయడమే కాకుండా, దుంగలు మాయమవడం చూస్తే కంచే చేను మేసినట్టుగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు.

రీజనబుల్ టైం అంటే ఎంత?

మొదటిపేజీ తరువాయి...

తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రిట్ పిటిషన్‌ను, మరికొందరు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఒకశలో అసెంబ్లీ కార్యదర్శి స్పీకర్‌ను సంప్రదించి తెలుసుకొని రేపే (మంగళవారం) వివరణ ఇవ్వాలని న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం చెప్పింది. వెంటనే జోక్యం అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తమకు కనీసం మూడునాలుగు రోజుల పాటు గడువు ఇవ్వాలని కోరారు. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 18కి వాయిదా వేసింది.

పుణ్యకాలం 10 నెలలు గడిచిపోయింది..

అంతకుముందు అసెంబ్లీ కార్యదర్శి తరపున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ నుంచి సమాచారం తెలుసుకుని చెప్పేందుకు మరింత సమయం కావాలని కోరారు. స్పీకర్‌తో అసెంబ్లీ కార్యదర్శి చర్చించి వివరాలు తెలుసుకొని చెప్పేందుకు రెండు వారాల గడువు కావాలన్నారు. సంపత్‌కుమార్, సుభాష్‌దేశాయ్ కేసుల్లో సుప్రీంకోర్టు.. స్పీకర్ రీజనబుల్ టైంలోగా చర్యలు తీసుకోవాలని చెప్పిందని, ఆ సముచిత సమయాన్ని తేల్చాల్సింది స్పీకరేనని చెప్పారు. స్పీకర్ ఎదుట ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు ఒక్కటే లేదని, ఇతరత్రా చాలా విధులను స్పీకర్ నిర్వర్తిస్తారని అన్నారు. దీనిపై కల్పించుకున్న ధర్మాసనం.. ఇప్పటికే 10 నెలలైందని, ఇంకెంత గడువు కావాలని ప్రశ్నించింది.

బాహాటంగానే ఫిరాయింపులు

పిటిషనర్ల తరపున హాజరైన ఇతర సీనియర్ న్యాయవాదులు అర్యమ సుందరం, నాయుడు, మోహిత్‌రావు తమ వాదనలు వినిపిస్తూ, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసి పది నెలలైనప్పటికీ స్పీకర్ స్పందించడం లేదని తెలిపారు. పార్టీ ఫిరాయింపులు బాహాటంగానే జరుగుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ ఎజెండాపై గెలుపొందిన 10 మంది ఎమ్మెల్యేలపై గత ఏడాది మార్చిలో ఫిర్యాదు చేస్తే నేటికీ చర్యలు శూన్యమన్నారు. ఒక ఎమ్మెల్యే (దానం నాగేందర్) అయితే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని, మరో ఎమ్మెల్యే (కడియం శ్రీహరి) కూడా కాంగ్రెస్ కండువా కప్పుకుని తన కూతురును ఎంపీగా గెలిపించేందుకు బాహాటంగా ప్రచారం చేశారని చెప్పారు. ఇలాంటి ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయకపోతే పార్టీ ఫిరాయింపుల చట్టానికి తూట్లు పొడిచినట్లు అవుతుందని, ప్రజాస్వామ్యం మంటగలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేండ్ల చట్టసభ పదవీ కాలం పూర్తయ్యే వరకు కాలయాపన చేయడానికి వీల్లేదని అన్నారు. రీజనబుల్ టైంకు నిర్దిష్ట గడువు ఉంటుందని చెప్పారు. మూడు నెలల్లోగా స్పీకర్ తన ముందున్న ఫిర్యాదులను పరిష్కరించాలని, ఈ మేరకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. గతంలో కేశం మేఘాచంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలుచేయాలని కోరారు. వాయిదాల పేరుతో చర్యలు తీసుకోవడంలో కాలయాపన చేయడం సరికాదన్నారు.

మూడు నెలలైనా రుణమాఫీ కాలే

జగిత్యాల కలెక్టరేట్‌కు దమ్మన్నపేట రైతుల ఫిర్యాదు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 10: సన్న వడ్ల బోనస్ కోసం ఎవుసం వదిలిపెట్టి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన రైతులు తమకు బోనస్ ఇప్పించాలని, రూ.2 లక్షల రుణమాఫీ జరిగేలా చూడాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్‌కు విన్నవించారు. బోనస్ రావడం లేదని, తమ గ్రామంలో రుణమాఫీ ఎవరికీ కాలేదని మండిపడ్డారు.

బీర్ల ధరలు 15 శాతం పెంపు

- ధరల సవరణకు ప్రభుత్వం అనుమతి
- రూ.20-30 వరకు పెరిగే అవకాశం
- బీర్ల కంపెనీల ఒత్తిడికి తలొగ్గిన సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): మద్యం ప్రియులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. బీర్ల ధరలను 15 శాతం పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పెంపు మంగళవారం నుంచే అమల్లోకి రానున్నది. ధరల నిర్ణయ కమిటీ సూచనల మేరకు రేట్లు పెంచుతున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ధరల పెంపు నిర్ణయంతో ఒక్కో బీరుపై సగటున రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగే అవకాశం ఉన్నదని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి. దీంతో దాదాపు ఐదేండ్ల తర్వాత రాష్ట్రంలో ధరలు పెరుగనున్నాయి. మరోవైపు ధరల పెంపు నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీర్ల కంపెనీల ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గిందని మద్యంప్రియులు మండిపడుతున్నారు. ఇటీవల జరిగిన హైడ్రామాను ఉదహరిస్తున్నారు. బీర్ల ధరలు పెంచకపోతే సరఫరా నిలిపివేస్తామని యూబీ గ్రూప్ హెచ్చరించడం, ఆ తర్వాత ప్రభుత్వం ధరల నిర్ణయ కమిటీని వేయడం, ఇప్పుడు ధరలు పెంచడం వంటివన్నీ పథకం ప్రకారమే జరిగాయని ఆరోపిస్తున్నారు. సరిగ్గా ఎండాకాలం ప్రారంభం కాగానే ధరలు పెంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎండాకాలంలో బీర్ల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని, సమయం చూసి దోచుకునేందుకే ప్రభుత్వం బీర్ల ధరలు పెంచిందని మండిపడుతున్నారు.

ఏపీలోనూ ఒకేరోజు?

ఏపీలోనూ సోమవారమే మద్యం ధరలు పెరిగాయి. ఆ రాష్ట్రంలో ధరలను 15 శాతం సవరిస్తూ అక్కడి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది యాదృచ్ఛికం మాత్రం కాదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు రాష్ట్రాలకు చెందిన 'పెద్ద' మనుషులు సిండికేట్ అయ్యారని, ఉమ్మడిగానే ధరల పెంపు డ్రామా ఆడి అమలు చేశారని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మద్యం ఆదాయంపై కన్నేసిందని అంటున్నారు. ఇందులో భాగంగానే కొత్త బ్రాండ్ల బీర్లను ప్రవేశపెట్టాలని చూసిన సంగతిని గుర్తు చేస్తున్నారు. అయితే ఆ విషయం రచ్చ కావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రభుత్వానికి ఆదాయం పడిపోతున్నకొద్దీ మద్యం అమ్మకాలపైనే దృష్టి పెట్టిందని, ఎక్సైజ్ అధికారులకు జిల్లాలు, స్టేషన్ల వారీగా టార్గెట్లు పెట్టి అమ్మించిందని చెప్తున్నారు. ప్రతి వారం సమీక్షలతో టార్గెట్లు చేరుకునేలా ఒత్తిడి చేసిందని, ఇప్పుడు ధరల పెంపు రూపంలో మందుబాబులను దోచుకునేందుకు సిద్ధమైందని అంటున్నారు.